క్లుప్తంగా

ఎట్టకేలకు శిక్షణకు హాజరయ్యారు..



పిట్టలవానిపాలెం: ఎట్టకేలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధుల శిక్షణకు బుధవారం ఆరుగురు సర్పంచులు హాజరయ్యారు. మొత్తం మీద మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మ....మ...అనిపించారు. మండలంలోని 14 గ్రామపంచాయతీలకు గాను 14 మంది సర్పంచులు ఉండగా మొదటి రోజు శిక్షణకు ఆరుగురు సర్పంచులు హాజరు కాగా రెండో రోజు ఒక్కరు కూడా హాజరుకాలేదు. చివరి రోజు తొలి రోజు హాజరైన ఆరుగురు సర్పంచులు మాత్రమే హాజరయ్యారు.

గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం గ్రామానికి చెందిన మంతెన వెంకటనరసమ్మ(58) బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె చిన్న చిన్న శుభకార్యాలకు వంటలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత నెలలో ఖాజీపాలెంలో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు అన్నం గంజి వారుస్తుండగా శరీరంపై పడి తీవ్రంగా గాయపడింది. బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు చందోలు ఎస్ఐ స్వామి శ్రీనివాస్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆఫీసులో స్వాతంత్య్ర వేడుకలు

రేపల్లె రూరల్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కర్లపాలెం: అందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని కర్లపాలెం పంచాయతీ కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు తెలిపారు. కర్లపాలెం పంచాయతీలో బుధవారం ఆరోగ్య సిబ్బంది జ్వరాల సర్వే నిర్వహించగా పంచాయతీ సిబ్బంది దోమల నివారణకు ఎబెట్ ద్రావణం పిచికారీ చేశారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

రేపల్లె రూరల్: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని విద్యుత్‌శాఖ తెనాలి ఈఈ వీవీ చిరంజీవి హెచ్చరించారు. విద్యుత్ విజిలెన్స్ అధికారులు పట్టణంలో బుధవారం నిర్వహించిన విద్యుత్ కనెక్షన్ల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి 128 మంది సిబ్బంది పట్టణంలోని 5,787 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారన్నారు. 205 మంది వినియోగదారులు అధిక లోడు వాడుతున్నట్లు గుర్తించి రూ.9.55 లక్షల అపరాధ రుసుం విధించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రేపల్లె డీఈ శ్రీనివాసరావు, పట్టణ ఏఈ ఏడుకొండలు పాల్గొన్నారు.

సూరేపల్లిలో బేటీ బచావో- బేటీ పడావో

సూరేపల్లి(భట్టిప్రోలు): బాలికల కోసం నిర్దేశించిన సేవలపై అవగాహన సామర్థ్యాన్ని మెరుగుపరచడమే బేటీ బచావో బేటీ పడావో లక్ష్యమని సర్పంచి మోర్ల విజయలక్ష్మి అన్నారు. అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో భట్టిప్రోలు మండలం పల్లెకోన సెక్టార్‌లోని సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్‌లో బుధవారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు, కిశోర బాలికలలో రక్త హీనత గూర్చి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫజరున్నీస్సా, ఏఎన్ఎం ఎం.అరుణజ్యోతి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, శ్యామ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు యు.సంతోషం, కె.విజయకుమారి, వై.జయప్రద, ఐ.లక్ష్మీసుధ పాల్గొన్నారు.

బీసీల బ్యాక్లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

తెనాలి: ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు బ్యాక్‌లాగ్ పోస్టులను ఎప్పటికప్పుడు పూరిస్తున్న ప్రభుత్వాలు వేలాది ఖాళీలున్న బీసీల బ్యాక్‌లాగ్ పోస్టులను కూడా వెంటనే భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఒక ప్రకటనలో కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో అనంత రామన్ కమిషన్ సిఫారసుల మేరకు,1977లో తొలిసారిగా బీసీలకు 25 శాతం రిజర్వేషన్లు ఇచ్చినట్టు గుర్తుచేశారు. చట్ట ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు అమలు జరపాల్సి ఉన్నా, అన్ని ప్రభుత్వ శాఖల్లో, యూనివర్సిటీల్లో, ఎయిడెడ్ సంస్థల్లో, కార్పొరేషన్లలో పూర్తిస్థాయిలో అమలు జరపడం లేదన్నారు. బీసీలకు రిజర్వేషన్లు ఇప్పటి వరకు 8–12 శాతానికి మించలేదన్నారు. అన్ని రంగాలలో పూరించాల్సిన బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులు సుమారు లక్ష ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ పోస్టులను వెంటనే భర్తీ చేసి, బీసీ నిరుద్యోగ యువత సాధికారితకు దోహదపడాలని కోరారు.

ఇది ఆరంకెల బుల్లెట్టు..

- తపాలా సేవల్లో పిన్‌కోడ్ కీలకం
- పోస్టల్ ఇండెక్స్ నంబర్‌తో ఉత్తరం చేరే ప్రాంతం గుర్తింపు
- నేడు జాతీయ పిన్‌కోడ్ దినోత్సవం



ఉత్తరాల బాక్స్

పిట్టలవానిపాలెం: తోకలేని పిట్ట తొంభై ఆమడలు ప్రయాణిస్తుందనే పొడుపు కథ అందరికీ తెలిసిందే. దానికి సమాధానం పోస్టు కార్డు అని ఎవరైనా టక్కున చెప్పేస్తారు కూడా.. పదులు, వందలు, వేల మైళ్ల ప్రయాణించి ఉత్తరాలు గమ్యస్థానానికి ఎలా చేరుకుంటాయి..! పోస్టు మేన్ ఇంటికి తెచ్చి ఇస్తేనా..! కానే కాదు.. మరెలా.. అదెలా అంటే ఆరంకెల పిన్‌కోడ్ ఆధారంగా... నేడు జాతీయ పిన్ కోడ్ దినోత్సవం.

పూర్వం ఇలా...

పూర్వ సమాచారం వేగుల ద్వారా ఒక చోట నుంచి మరోచోటకు చేరేది. రానురాను పావురాలకు శిక్షణ ఇచ్చి వాటి కాళ్లకు చీటీలు కట్టి పంపడం ద్వారా సమాచారాన్ని చేరవేసేవారు. తర్వాతి కాలంలో 1858లో బ్రిటీష్ వారు మన దేశాన్ని పరిపాలించిన రోజుల్లో తపాలా సేవకు శ్రీకారం చుట్టారు. స్వాతంత్య్రం వచ్చాక 1974 ఏప్రిల్ ఒకటిన తపాలా సేవల్లో మార్పులు చేసి ఆ వ్యవస్థను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చారు. 2011 మార్చి 31 నాటికి దేశంలో 1,54,856 తపాలా కార్యాలయాల్లో 4,66,963 మంది ఉద్యోగులు సేవలందిస్తున్నారు. అప్పట్లో ఒక తపాలా కార్యాలయం 2,123 చ.కి.మీటర్ల పరిధిలో 7,114 మందికి సేవలు అందించేది. తపాలా శాఖ ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఆదాయం సమకూరుతుంది.

పిన్‌కోడ్‌లో మొదటి అంకె సూచించే రాష్ట్రాలు..

పిన్ నంబర్ 1: ఢిల్లీ, హరియాణా, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్ముకాశ్మీర్
పిన్ నంబర్ 2: ఉత్తర ప్రదేశ్, ఉత్తరాంచల్
పిన్ నంబర్ 3: రాజస్థాన్, గుజరాత్
పిన్ నంబర్ 4: మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, చత్తీస్ ఘడ్
పిన్ నంబర్ 5: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక
పిన్ నంబర్ 6: కేరళ, తమిళనాడు
పిన్ నంబర్ 7: పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాలు
పిన్ నంబర్ 8: బిహార్, జార్ఖండ్
పిన్ నంబర్ 9: ఆర్మీ పోస్టల్ సర్వీస్

అంకెకో లెక్కుంది :

పిన్ కోడ్‌లోని ఆరంకెల్లో ఒక్కో దానికి ఒక్కో లెక్క ఉంది. ఈ పిన్‌కోడ్‌ను 1972 ఆగస్టు 15న ప్రారంభించారు. అప్పట్లో దేశం మొత్తం మీద తొమ్మిది పిన్‌కోడ్ ప్రాంతాలు మాత్రమే ఉండేవి. మొదటి ఎనిమిది భౌగోళిక ప్రాంతాలను, తొమ్మిది ఆర్మీ పోస్టల్ పోస్టల్ సర్వీసును నెలకొల్పారు. పిన్‌కోడ్‌లోని మొదటి అంకె దేశంలోని పోస్టల్ రీజియన్(ప్రాంతం)ను రెండవ అంకె సబ్ రీజియన్‌ను, మూడో అంకెను ఉత్తరం జిల్లాను, చివరి మూడు అంకెలు సంభంధిత పోస్టాఫీసును తెలియజేస్తాయి.

పిన్ కోడ్‌తో ఉపయోగం

పోస్టు కార్డుపై చిరునామా రాస్తాం కదా మరి పిన్ కోడ్ ఎందుకనే సందేహం కలగవచ్చు. మన పక్క ఊరికో లేదా ఆ పక్క ఊరికో కార్డు పంపాలంటే పిన్ కోడ్ లేకున్నా సులభంగానే పంపవచ్చు. దేశంలో లక్షల సంఖ్యలో ఉన్న గ్రామాలకు కార్డులు చేరవేయాలంటే మాత్రం చాలా కష్టం. అందుకే ఆ గ్రామాలను గుర్తించే విధంగా ఆరు అంకెలు కలిగిన సంఖ్యను ఏర్పాటు చేశారు. అదే పోస్టల్ ఇండెక్సు నెంబర్(పీఐఎస్) ఈపిన్‌ను చిరునామా కింద పిన్ అని ఉన్న చోట రాస్తే చేరాల్సిన చోటికి వేగంగా చేరుతుంది.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

సేంద్రియ వ్యవసాయ ప్రాజెక్టు అధికారి వాణిశ్రీ



వరి పొలాన్ని పరిశీలిస్తున్న వాణిశ్రీ

పిట్టలవానిపాలెం: గ్రామాలలలో సుస్థిర సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు బాపట్ల జిల్లా సుస్థిర సేంద్రియ వ్యవసాయ ప్రాజెక్టు అధికారి వాణిశ్రీ తెలిపారు. మండలంలోని పలు గ్రామాలో బుధవారం పర్యటించారు. సేంద్రియ వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న పొలాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ విధానంలో పంటలు సాగు వలన తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు లభిస్తాయని తెలిపారు. అంతే కాక ఆహార ఉత్పత్తులు విషతుల్యం కాకుండా ఉంటాయని పేర్కొన్నారు.

దశపర్ణి కషాయంతో మేలు..

దశపర్ణి కషాయం వాడడం వల పైరులో ఆశించే చీడపీడలు నశిస్తాయని అల్లూరు యూనిట్ ఐసీఆర్‌పీ పుష్పకాంతం తెలిపారు. మండలంలోని అల్లూరు శివారు రెడ్లపాలెం గ్రామంలోని వాలి వెంకటశివారెడ్డి ఇంటి వద్ద దశపర్ణి కషాయాన్ని తయారు చేశారు. కార్యక్రమంలో జెడ్‌బీఎన్ఎఫ్ సిబ్బంది సుధారాణి, యామిని, రేఖ, రజిని, కృపావతి పాల్గొన్నారు.

రసాయనాల కంటే కషాయాలు మేలు

వరిలో రసాయనాల కంటే కషాయాలు చాలా మేలని జెడ్‌బీఎన్ఎఫ్ బాపట్ల డివిజన్ ఇన్‌చార్జి శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని మంతెనవారిపాలెం క్లస్టర్ పరిధిలోని పిట్టలవానిపాలెంలో సుస్థిర సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా చేప, బెల్లం ద్రావణాన్ని తయారీ విధానాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో మంతెనవారిపాలెం క్లస్టర్ యూనిట్ ఎల్‌టీ సౌజన్య, ఐసీఆర్‌పీలు చేబ్రోలు ఏసోబు, జీఎస్‌పాలెం ఎల్‌టీ ప్రవళిక సుమతి, లావణ్య ఉన్నారు.

గృహ నిర్మాణాలు వెంటనే ప్రారంభించేలా చూడాలి

మండల ప్రత్యేక అధికారి డాక్టర్ హనుమంతరావు



మాట్లాడుతున్న డాక్టర్ హనుమంతరావు

భట్టిప్రోలు: మండలంలోని హౌసింగ్ కాలనీల్లో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను వెంటనే ప్రారంభించేలా చూడాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు కోరారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిసెంట్లలతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం వంద రోజుల యాక్షన్ ప్లాన్ ప్రకారం నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. నిలిచిపోయిన పనులను వెంటనే ప్రారంభించేలా చూసి డిసెంబర్ నాటికి పూర్తి అయ్యేలా చూడాలని పేర్కొన్నారు. సచివాలయాల వారీగా ప్రతి వారానికి నిర్ధేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, ఈఓపీఆర్డీ టి.ఊహారాణి, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రావూరి సౌమ్య, శివకృష్ణ పాల్గొన్నారు.

విభజన నాటి చిత్రాల ప్రదర్శన



ప్రదర్శనను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్

తెనాలిరూరల్: దేశ విభజన భయానక దినోత్సవాన్ని పురస్కరించుకుని తెనాలి రైల్వే స్టేషన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ స్వాతంత్య్ర సమరంలో దేశ విభజన బాధాకరమన్నారు. తెనాలిలో విజ్ఞానదాయక, భావోద్వేగ ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినందుకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ గుంటూరు ఫీల్డ్ ఆఫీస్‌ను జైన్ అభినందించారు. ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా విభజన కథనాల గురించి మరింత తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. సీబీసీ గుంటూరు ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ఆర్. రమేష్ చంద్ర మాట్లాడుతూ మత ప్రాతిపదికన భారత దేశ విభజన నుంచి యువతరం పాఠాలు నేర్చుకోవడం ఎంతో అవసరమన్నారు. మత సామరస్యం, విభిన్న సంస్కృతులను గౌరవించడం భారతదేశ పురోగతిలో కీలకమని ఆయన అన్నారు. తెనాలి రైల్వేస్టేషన్ మేనేజర్ టి. వెంకట రమణ మాట్లాడుతూ భారతదేశం స్వాతంత్య్రం వచ్చిన అనంతరం అన్ని మతాలు, కులాలకు సమాన అవకాశాలు కల్పించిందని గుర్తుచేశారు. 1947లో విభజన ప్రక్రియలో ప్రాణాలు కోల్పోయిన ప్రజలకు నివాళులర్పించారు. ఆనాటి ఉద్రిక్త పరిస్థితులు, ప్రజల బాధలను వివరిస్తూ కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సహకారంతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు. మూడు రోజుల పాటు ప్రదర్శన ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు.

వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన ఉండాలి



శిక్షణకు హాజరైన ప్రజాప్రతినిధులతో అధికారులు



మాట్లాడుతున్న కర్లపాలెం ఎంపీపీ యారం వనజ

భట్టిప్రోలు: గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ బుధవారంతో ముగిసింది. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో గ్రామ పారిశుద్ధ్యంలో ఘన వ్యర్థాల నిర్వహణ, తడి, పొడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారీకి సంబంధించిన వివిధ దశలను గూర్చి ఎమ్మార్సీ బి.వెంకటేశ్వరరావు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, ఈఓపీఆర్డీ టి.ఊహారాణి పాల్గొన్నారు.


కర్లపాలెం: సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో గ్రామ పంచాయతీల అభివృద్ధికి పనిచేయాలని ఎంపీపీ యారం వనజ చెప్పారు. సర్పంచులకు కార్యదర్శులకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే రాష్ట్రం పరిశుభ్రంగా ఉంటుందని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రజల సహకారం తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎ.ఎలీషా బాబు, మండల పరిషత్ కార్యాలయం ఏఓ ఫైజుద్దీన్, సర్పంచ్‌లు కార్యదర్శులు పాల్గొన్నారు.

వేర్వేరు చోరీ కేసుల్లో నిందితుల గుర్తింపు

నాలుగు సవర్ల బంగారు గొలుసులు స్వాధీనం

తెనాలిరూరల్: తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో జరిగిన వేర్వేరు చోరీ ఘటనల్లో బాలిక సహా మహిళను పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి మొత్తం నాలుగు సవర్ల బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో సీఐ ఎస్.రమేష్ బాబు కేసు వివరాలను తెలియజేశారు. చినరావూరుతోటకు చెందిన 14 ఏళ్ల బాలిక ఇటీవల తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో రోగుల బంధువుగా తిరుగుతూ చోరీలకు పాల్పడుతోంది. వరసగా జరుగుతున్న చోరీలతో వైద్యశాల సూపరింటెండెంట్, అధికారులు సెక్యూరిటీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది నిఘా ఉంచగా బాలిక చోరీలకు పాల్పడుతున్నట్టు గుర్తించి ఆమెను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇదే బాలిక గతేడాది నవంబరులో తన తమ్ముడితో పాటు ఇంటి సమీపంలో నివసించే మరో ఇద్దరు చిన్నారులను విజయవాడలో పార్కును చూపిస్తాను, సాయంత్రంలోగా తిరిగి వచ్చేయవచ్చని చెప్పి ఎవరికీ చెప్పకుండా విజయవాడ తీసుకెళ్లింది. పిల్లలు కనబడకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా కొద్ది గంటల వ్యవధిలోనే వారి ఆచూకీ గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. అదే విధంగా ప్రభుత్వ వైద్యశాలలోనే రోగుల సహాయకులకు చెందిన రెండున్నర సవర్ల బంగారు చైన్‌ను అక్కడ సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఆయా డి.కుమారి చోరీ చేసింది. మరి కొందరు సహాయకుల బ్యాగుల్లోని నగదునూ అపహరించింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందగా సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిందితురాలిని గుర్తించినట్లు తెలిపారు. రెండు కేసుల్లోనూ సీసీ కెమెరాలు ఎంతగానో ఉన్నయోగపడ్డాయని చెప్పారు. నిందితులిద్దరూ తొలిసారి చోరీ ఘటనల్లో పట్టుబడడంతో చోరీ సొత్తును రికవరీచేసి వారిని వారించామని, మ రోసారి నేరానికిపాల్పడితే కఠినశిక్ష పడే విధంగా చ ర్యలు తీసుకుంటామని సీఐ రమేష్‌బాబు తెలిపారు.

పలువురు అధికారులు బాధ్యతలు స్వీకారం



నాంచారయ్య, తహసీల్దార్, నగరం



చంద్రశేఖరరావు, ఎంపీడీఓ, భట్టిప్రోలు



శివపార్వతి, ఎంపీడీఓ, రేపల్లె



భార్గవ్, ఎస్ఐ, నగరం



అమర్‌నాథ్, ఎస్ఐ, అమృతలూరు

నగరం: నగరం తహసీల్దార్‌గా జి.నాంచారయ్య బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా ఫిరంగిపురంలో తహసీల్దార్‌గా పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందిస్తానన్నారు. భూసమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

భట్టిప్రోలు ఎంపీడీఓగా చంద్రశేఖరరావు..

భట్టిప్రోలు: మండల అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ)గా గుమ్మా చంద్రశేఖరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఆయన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కృష్ణా జిల్లా మొవ్వ మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వచ్చిన జేబీవీ మల్లికార్జున రావు గత నెలాఖరున ఉద్యోగ విరమణ చేయడంతో ఈఓపీఆర్డీ టి.ఊహారాణి ఎఫ్ఏసీగా కొనసాగారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరావు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మండలాన్ని ప్రగతి పథంలో తీర్చిదిద్దే విధంగా కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎంపీడీఓగా శివపార్వతి..

రేపల్లె రూరల్: రేపల్లె ఎంపీడీఓగా శివపార్వతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లా నీరుళ్లపాడు నుంచి సాధారణ బదిలీపై రేపల్లెకు విచ్చేశారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన శ్రీనివాసులురెడ్డి ప్రకాశం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శివపార్వతికి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

నగరం ఎస్ఐ భార్గవ్..

నగరం: నగరం ఎస్ఐగా బండ్ల భార్గవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా నగరంలో పనిచేస్తున్న కోటేశ్వరావు రేపల్లె టౌన్‌కు బదిలీ కావడంతో ఏర్పడిన ఖాళీలో ఉన్నతాధికారులు భార్గవ్‌ను నియమించారు. గతంలో పోన్నూరు ఎస్ఐగా పనిచేశారు.

అమృతలూరు ఎస్ఐ అమర్‌నాథ్..

అమృతలూరు(వేమూరు): స్థానిక పోలీసు స్టేషన్ ఎస్ఐగా జానకి అమర్‌నాథ్ బుధ వారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన జి.నవీన్ కుమార్ ఇటీవల నిర్వహించిన బదిలీల్లో వీఆర్‌కు వెళ్లారు. వీఆర్‌లో ఉన్న జానకి అమర్‌నాథ్ ఇక్కడి వచ్చారు.

వ్యర్థాలను వెంటనే తొలగించండి



తెనాలిఅర్బన్: రోడ్లపై ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పట్టణంలోని 37,40 వార్డులలో బుధవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. రోడ్లపై వ్యర్థాలు ఉండటాన్ని గమనించిన ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపై వ్యర్థాలు కన్పిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం బస్టాండ్ అవుట్ గేట్ వద్ద ఉన్న అన్న క్యాంటిన్‌ను పరిశీలించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సుస్థిర వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

తెనాలి: రైతులు పంటల సాగులో సుస్థిర వ్యవసాయ పద్ధతులను పాటిస్తే అధిక నాణ్యత కలిగిన దిగుబడులతో చక్కని ఆదాయం పొందవచ్చని జాతీయ సుస్థిర సుగంధ ద్రవ్యాల (ఎస్ఎస్ఎస్‌పీ) డైరెక్టర్, కేరళకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ జె.మురళీధర మీనన్ చెప్పారు. రైతులు ఆ దిశగా పంటలను సాగు చేయాలని సూచించారు. కొల్లిపరలోని శ్రేష్ఠ ఉత్పత్తిదారుల సంఘం, నీలగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం కొల్లిపరలో సుస్థిర వ్యవసాయ పద్ధతులపై ఒకరోజు శిక్షణను నిర్వహించారు. కొల్లిపరలో పసుపు పంట సాగులో రైతులు ముందంజలో ఉన్నారని చెప్పారు. ఎత్తుమడులు, బిందుసేద్యం, 'గ్యాప్' సర్టిఫికేషన్ వంటి అంశాల్లో పురోగమిస్తుండటం అభినందనీయమని చెప్పారు. సేంద్రియ పద్ధతులను పాటిస్తూ మరింత మెరుగైన పంటల ఉత్పత్తిని సాధించవచ్చని తెలిపారు. మనదేశంకన్నా చైనాలో ఎనిమిది శాతం అధికంగా సేంద్రియ పదార్థాలు, మూడు శాతం సాధారణ ఎరువులు వినియోగిస్తున్నారని చెప్పారు. వ్యవసాయ శాఖ తెనాలి ఏడీఏ ఉషారాణి మాట్లాడుతూ, శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సేంద్రియ పంటల సాగుకు మరింతగా ప్రోత్సాహం అందించాలని సూచించారు. అదేక్రమంలో సర్టిఫికేషన్‌ను కూడా చేపట్టాలని సలహానిచ్చారు. సుస్థిర సాగు విధానాలపై మాస్టర్ ట్రైనర్లు కె.శ్యామ్ సుందరరెడ్డి, సాయిబాబు రైతులకు శిక్షణనిచ్చారు. నీలగిరి ఫౌండేషన్ సభ్యుడు రత్తయ్య అధ్యక్షత వహించారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

బాపట్లటౌన్: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు గాయలైన ఘటన పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయం సమీపంలో చోటుచేసుకుంది. పట్టణంలోని జగన్నాథపురానికి చెందిన బొమ్మనబోయిన ఏసుబాబు, బాపట్ల మండలం, మర్రిపూడి గ్రామానికి చెందిన తుమ్మా గోపాలరెడ్డి ఇరువురు ద్విచక్రవాహనాలపై ఎదురెదురుగా ఢీకొట్టుకున్నారు. ఈ ఘటనలో గోపాలరెడ్డికి కుడికాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఇరువురు వైద్యచికిత్సల నిమిత్తం ఏరియా వైద్యశాలలో చేరారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

వేమూరు: మండలంలోని చంపాడుకు చెందిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు అయినట్లు ఎస్ఐ రవి కృష్ణ తెలిపారు. వివరాలు..చంపాడు గ్రామ సచివాలయంలో జంపనికి చెందిన పులి సీతయ్య వీఆర్వోగా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మోటుపల్లి చైతన్యకుమార్, మోటుపల్లి అనూరాధ, కాకాని కాన్యకుమారి, కులంతో దూషించారని సీతయ్య ఫిర్యాదు చేశారు. కేసును రేపల్లె డీఎస్పీ టి.మురళీ కృష్ణ విచారించనున్నట్లు చెప్పారు.

మువ్వన్నెల జెండా రెపరెపలు



కర్లపాలెంలో జాతీయ జెండాను ప్రదర్శనగా తీసుకొస్తున్నవిద్యార్థులు

కర్లపాలెం: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్లపాలెం శ్రీ భార్గవి హైస్కూల్ విద్యార్థులు 205 అడుగుల జాతీయ జెండాను ఊరేగించారు. భారత్ మాతాకి జై, వందేమాతరం అంటూ విద్యార్థులు నినదించారు. జెండాను శ్రీ భార్గవి హైస్కూల్ నుంచి కర్లపాలెం సెంటర్ వరకు ఊరేగించారు.



భట్టిప్రోలు మండలం ఐలవరంలో జాతీయ జెండాలను చేబూని పురవీధులలో తిరుగుతున్న చిన్నారులు

జాతీయ జెండా స్ఫూర్తి

భట్టిప్రోలు: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు జాతీయ జెండాలు చేతబూని ర్యాలీ నిర్వహించారు. మండలం ఐలవరంలో చిన్నారులు జాతీయ జెండాలను చేబూని పురవీధులలో తిరిగి పలువురిని ఆకర్షించారు.